క్లుప్తంగా

విజయదుర్గమ్మకు పూజలు


పూజలందుకున్న అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాల వీధిలో ఉన్న విజయదుర్గ అమ్మవారి ఆలయంలో వైశాఖమాసం శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలోని నీలమణి దుర్గ ఆలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. అర్చకులు ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త మజ్జి లక్ష్మీనారాయణ, రమణమ్మ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

నేడు హన్‌మాన్ జయంతి వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని పలు ఆలయల వద్ద శనివారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు ఉంటాయని అర్చకులు తెలిపారు. మంగువారితోటలోని ప్రసన్న ఆంజనేయ స్వామికి అభిషేకాలు, పారాయణలు జరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. విశాఖ–బీ కాలనీలోని షిర్డీసాయి మందిరంలో గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణ జరుగుతుంది.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


బాబా విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో షిర్డీ సాయి బాబా ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. సాయి నామం హోరెత్తింది. పూజ్య గురువులు అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో బాబా విగ్రహాన్ని ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


యాబాజీఖాన్‌లో పనులు పరిశీలిస్తున్న చిట్టిరాజు

గార: ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న వేతనదారులు పనిలెక్కింపు ఆధారంగానే గరిష్ట వేతనం పొందవచ్చని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. వాడాడ పంచాయతీ పరిధి కొత్తూరు, మదనాపురం, యాబాజీఖాన్ గ్రామాల్లో జరుగుతున్న పనులను శుక్రవారం ఉదయం పరిశీలించారు. సమయపాలన పాటించాలని వేతనదారులకు సూచించారు. చెరువులు అభివృద్ధి చేయడం వలన రైతాంగానికి మేలు జరుగుతుందన్నారు. ఏపీవో సీహెచ్ సంధ్యారాణి, జేఈ నారంనాయుడు, టీఏలు, ఫీల్డు అసిస్టెంట్‌లు, మేట్‌లు ఉన్నారు.

ఇసుక లారీ పట్టివేత

గార: మండల పరిధిలోని అంపోలు జిల్లా జైలు సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సెబ్, పోలీసులు పట్టుకున్నారు. గురువారం రాత్రి దాడి చేసి కేసు నమోదు చేశామని ఎస్సై కె.కృష్ణప్రసాద్ శుక్రవారం తెలిపారు.

• నైవేద్యం..


సంతోషిమాతకు నైవేద్యం సమర్పించిన దృశ్యం

పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో వైశాఖమాసం శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధర్వర్యంలో మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమపూజలు చేశారు. అలాగే 58 రకాల వంటలతో అమ్మవారికి నైవేద్యం సమరిృంచారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

• విరాళం..

రిమ్స్ అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకానికి హయాతీనగరానికి చెందిన కిల్లాన మాధవరావు తన కుమార్తె సంతోషి రూప పుట్టిన రోజు సందర్భంగా రూ.10 వేలు విరాళం ప్రకటించారు. విరాళం మొత్తాన్ని సంఘం కాదరర్ని ఫాల్గుణరావుకు శుక్రవారం అందజేశారు. సంఘ అధ్యక్షులు గంగుల రమణబాబు, జిల్లా అధ్యక్షులు సూరరామచంద్రరరావు ఉన్నారు. – శ్రీకాకుళం కల్చరల్


విరాళం అందిస్తున్న మాధవరావు

• ముగిసిన శిక్షణ


ధ్రువపత్రాలతో శిక్షణ పొందిన విద్యార్థులు

శ్రీకాకుళం శాంతినగర్ కాలనీలోని సత్యసాయి నృత్య కళానికేతన్‌లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. నృత దర్శకులు ఎన్.పి.కవిత ఆధ్వరంలో 30 మందికి నెలరోజుల పాటు భరత నాట్యంలో ఉచితంగా శిక్షణ ఇచ్చారు. వీరికి ధ్రువపత్రాలు అందచేశారు.

– శ్రీకాకుళం కల్చరల్

పెట్రోల్‌పై ఆంక్షలతో రైతులకు ఇబ్బంది

• మండల సమావేశంలో సభ్యుల ఆవేదన


మాట్లాడుతున్న ఎంపీపీ రఘురామ్

గార: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పెట్రోలియం లూజు అమ్మకాలపై విధించిన ఆంక్షలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. కొర్లాం సర్పంచ్ పీస శ్రీహరిరావు, పీస గోపి తదితరులు మాట్లాడుతూ.. ఈసీ నిబంధనతో రైతులు నీటి ఇంజిన్లు వగైరాలకు డీజిల్, పెట్రోలు అవసరమని, వీటి అమ్మకాలపై ఆకంక్షలు పెట్టడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఆలోచన చేయాలన్నారు. అందరి సభ్యులు అభ్యర్థన మేరకు ఉపాధి హామీ పథకంలో సాగునీటి కాలువుల్లో పూడిక తీత పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కె.మత్స్యలేశం పరిధిలోని పలు వీధుల్లో లైట్లు నిరంతరం వెలుగుతున్నాయని, దీనికి ప్రత్యేక కేబుల్ వేసుకోవాలని చెబుతున్నారని అంచనాలు వేయాలని సర్పంచ్ బి.లలిత కోరారు. కొర్ని పంచాయతీలో సమస్యపై పలుమార్లు విన్నవించామని పరిశీలనలోకి తీసుకోవాలని సర్పంచ్ పీస గోపి కోరారు. బూరవెల్లి సచివాలయం పరిధిలో ఎనర్జీ అసిస్టెంట్ పోస్టు భర్తీ చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు అన్నారు. దీనికి జేఈ పవన్‌కుమార్ సమాధానం ఇస్తూ ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి భర్తీ చేస్తామన్నారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. రైతు భరోసా కేంద్రాల వద్ద రైతుల అభ్యర్థన మేరకు జీలుగు, కట్టె జనుము విత్తనాలు అందిస్తున్నామన్నారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు తర్వాత వరి విత్తనాలకు సబ్సిడీ ప్రకటిస్తారని చెప్పారు. యాక్షన్ ప్లాన్ ప్రకారం 1380 క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలకు ప్రతిపాదనలు పెట్టామన్నారు. ఇంకా వీటిని పెంచే అవకాశం ఉందన్నారు. తొలుత కళింగపట్నం సచివాలయ ఉద్యోగిని పప్పు సుశీల మృతికి సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఎంపీడీవో బి.కల్యాణి, అరవల రామకృష్ణ, అందవరపు బాలకృష్ణమూర్తి, మార్పు పృధ్వీరాజ్, కొయ్యాన నాగభూషణం, యాళ్ల నారాయణమూర్తి పాల్గొన్నారు.

ధూమపానం ప్రాణాంతకం


అవగాహన కల్పిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: ధూమపానం ప్రాణాంతకమని, ప్రపంచవ్యాప్తంగా మరణాల రేటు పెరగడానికి ఇదే కారణమని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ అన్నారు. శ్రీకాకుళం పెద్ద మార్కెట్ ప్రాంతంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు వినియోగంతో శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, కంటి శుక్లాలు, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులు సోకుతాయన్నారు. సిగరెట్ పొగ శరీరంలోకి చేరి ప్రమాదకరమైన కణాలను విడుదల చేసి నిండు ప్రాణాలను బలితీసుకుంటుందన్నారు. ధూమపానానికి యువత అలవాటు పడడం బాధాకరమన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ కుమార్, ప్రముఖ వైద్యురాలు సింధూర మాట్లాడుతూ.. ప్రస్తుతం చాలా మంది పొగాకు వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నారన్నారు. పొగాకు వల్ల వచ్చే ప్రమాదలపై అవగాహనలేక పోవడం వల్లే వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా అవగహన కల్పిండమే ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా పొగాకు వ్యతిరేకంగా స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, లయన్స్‌క్లబ్ వైస్ ప్రెసిడెంట్ బి.విశ్వేశరరావు, క్లబ్ సభ్యులు బోగెల ఉమామహేశ్వరరావు, ఉర్లం శివతేజ పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు


ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

జి.సిగడాం: ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు సర్వే నిర్వస్తున్నామని ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు తెలిపారు. జి.సిగడాం, గొబ్బూరు గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. భవిత పాఠశాలల్లో అందించే సేవలపై అవగాహన కల్పించారు. బడిలో చేరని 18 ఏళ్ల లోపు సిడబ్ల్యూఎస్ పిల్లలను గుర్తించేందుకు ఇంటింటా సర్వే చేపడుతున్నామన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలు ఉంటే గ్రామస్థాయిలో పని చేస్తున్న అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్టీలు టి.కృష్ణ, సి.హెచ్.మాధురి, కృష్ణవేణి పాల్గొన్నారు.

పిల్లల గుర్తింపునకు సర్వే


సర్వేను పరిశీలిస్తున్న సహిత సిబ్బంది

గార: ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి భవిత కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు పంపేందుకు ముమ్మురంగా సర్వే చేస్తున్నామని ఎంఈవో–2 పి.వినోదిని చెప్పారు. మే ఒకటో తేదీ నుంచి జూన్ తొమ్మిదో వరకు సర్వే చేపడుతున్నట్టు పేర్కొన్నారు. నిజామాబాద్ పంచాయతీలో చేపట్టి సర్వేను శుక్రవారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ ఎ.రఘులక్ష్మి ఉన్నారు.

మరింత రుచిగా మధ్యాహ్న భోజనం


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రణస్థలం: ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు ప్రారంభం కాగానే మధ్యాహ్న భోజనం నిర్వాహకులు తప్పనిసరిగా హాజరుకావాలని, భోజనం మరింత రుచిగా వండాలని జిల్లా మాస్టర్ ట్రైనీ కె.సుశీల అన్నారు. మండలంలోని జే.ఆర్.పురం హైస్కూల్లో 108 ప్రభుత్వ పాఠశాలల నుంచి విచ్చేసిన వంట నిర్వాహకులతో పోషణ్ అభియాన్‌పై సమావేశం ఏర్పాటు చేశారు. రుచిగా వంట ఎలా చేయాలో నేరుగా చేసి చూపించారు. వంటలో మెలకువలు నేర్పించారు. అన్నీ పాఠశాలల్లోనూ విద్యార్థులకు సరిపడ భోజనం తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎ.త్రినాథరావు, ఎంఈఓ–2 బి.లావణ్య, సీఆర్పీలు, మధ్యాహ్న భోజనం వంట మహిళలు పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు


అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రసాదరావు

సారవకోట: ఎన్నికల అనంతరం గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలని నరసన్నపేట సీఐ ప్రసాదరావు సూచించారు. మండలంలోని అలుదు పంచాయతీ వడ్డినవలసలో ఎన్నికల అనంతరం జరుగుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి ఘర్షణలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల రోజు సైతం ఇక్కడున్న ఇరు పార్టీల వారు ఘర్షణకు దిగారని, ఇదే పరిస్థితి కొనసాగితే క్షమించేది లేదన్నారు. ఎస్ఐ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యం


క్రీనిడి సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంటున్న కళాశాల ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా విద్యను అందిస్తున్నామని ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రమణమూర్తి నాయుడు అన్నారు. కళాశాలలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన క్రీనిడి టెక్నాలజీస్ నైపుణ్య శిక్షణ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. నైపుణ్య శిక్షణ సంస్థలు, పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు వివరించారు. పారిశ్రామిక అవసరాలపై ప్రత్యేక శిక్షణ, పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. శిక్షణ సంస్థ ప్రతినిధులు, అధ్యాపకులు, మేనేజ్‌మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

చాపరలో కార్డన్ సెర్చ్

మెళియాపుట్టి: ఎన్నికల విధుల్లో భాగంగా చాపర గ్రామంలో పాతపట్నం సీఐ నల్లి సాయి, స్థానిక ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలు వీధులలో పోలీసులు తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల నియామావళిలో భాగంగా ప్రజలు కోడ్ ఉల్లంఘనకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో మెలగాలని పిలుపునిచ్చారు. ఫలితాలు వెలువడిన రోజు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసుకుని గొడవలు పడొద్దని, అటువంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో పోలీసుల నిఘా ఉంటుందని, శాంతిభద్రతకు సహకరించాలన్నారు. పాతపట్నం ఎస్సై మహమ్మద్ యాసిన్, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


చాపరలో కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్న సీఐ సాయి, పోలీసులు

జూలై 13 నుంచి సంతోషిమాత జయంతి ఉత్సవాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్నదృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో జూలై 13 నుంచి 15వ తేదీ వరకూ అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయని ఈవో సర్వేశ్వరరావు, అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం విడుదల చేశారు. 13న అమ్మవారి పుట్టిన రోజున 1008 కలశాలతో నమక చమక సహిత అభిషేకాలు, 108 లీటర్ల పాలతో అభిషేకాలు, 13 పట్టు చీరలతో చండీహోమం జరుగుతోందన్నారు. జూలై 19న అమ్మవారిని శాకాంబరిదేవిగా అలంకరిస్తామని చెప్పారు. అలాగే శ్రావణ మాసోత్సవాలను ఆగస్టు ఐదు నుంచి సెప్టెంబర్ మూడో తేదీ వరకూ నిర్వహిస్తామని వెల్లడించారు.

4 నుంచి యోగా శిబిరం

నరసన్నపేట: స్థానిక సూర్యనారాయణస్వామి ఆలయం ఎదురుగా ఉన్న యోగా భవనంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వేసవి ప్రత్యేక హ్యాపీనెస్ ప్రొగ్రాం (యోగా శిబిరం) ఆరు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆసక్తి ఉన్నవారు పాల్గొనచ్చని యోగా గరువు సందీప్ శుక్రవారం కోరారు. జూన్ 4 నుంచి 9వ తేదీ వరకు రోజూ ఉదయం 5.30 నుంచి 8.30 గంటల వరకు యోగా తరగతులు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 90145 86930 నంబర్‌కు ఫోను చేసి తెలుసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సందీప్ వివరించారు.

చిన్నారుల్లో ఆసక్తిని పెంచేలా వేసవి వినోదం


నీతికథ గురించి వివరిస్తున్న బాలిక

శ్రీకాకుళం న్యూకాలనీ: చిన్నారుల్లో ఆసక్తిని పెంచేలా వేసవి వినోద కార్యక్రమాలను రూపొందించినట్టు క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో వేసవి వినోదం పేరిట నాలుగు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు వివిధ అంశాల్లో ఉచిత ప్రత్యేక శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం పలువురు వక్తలు హాజరై పిల్లలకు డ్రాయింగ్ వేయడం, చిత్రలేఖనం, గీతాలాపాన, కథలు, పొడుపు కథలు వంటివి వివరించారు. విశ్రాంత ఉప విద్యాశాఖాధికారి కొత్తకోట అప్పారావు, ఉపాధ్యాయులు, 76 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

వానరం దాహార్తి తీర్చాడు..!


బిస్కెట్ తినిస్తున్న యువకుడు


స్ట్రాతో డ్రింక్ తాగుతున్న కోతి

ఆకలి, దాహం మనిషికైనా, జంతువుకైనా ఒకటే. వాటిని తీర్చే వారు మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తారు. శ్రీకాకుళం పట్టణంలోని ఏడురోడ్ల కూడలి వద్దకు దారి తప్పిపోయిన ఓ కోతి శుక్రవారం వచ్చింది. ఎండ తీవ్రతతోపాటు ఆకలితో అల్లాడుతున్న ఆ వానరాన్ని ఓ యువకుడు గమనించాడు. ధైర్యం చేసి కోతి చెంతకు చేరాడు. బిస్కెట్లను తినిపించాడు. కూల్ డ్రింక్‌ను తాగించి వానరానికి ఎండ..ఆకలి నుంచి ఉపశమనం కలిగించి ఆదర్శంగా నిలిచాడు.

–శ్రీకాకుళం కల్చరల్